# మానవత వికసించాలి!

పిభాష్యం రాజేశ్వరరావు



హాలంతా ఒక్కసారి నిశ్శబ్దమయిపోయింది!

ఎయిర్ కండిషనర్స్ శబ్దం మినహా, సూది క్రిందపడినా, వినబడేటంతటి నిశ్శబ్దం!

పర్సనల్"ఆఫీసరు గొంతు సవరించుకుని అన్నాడు "మిస్టర్ సద్గుణరావ్! మరొక్కసారి ఆలోచించండి!"

సద్గుణరావు మాట్లాడలేదు!

అంతలోనే జనరల్ మేనేజరు కలుగజేసుకున్నాడు "ఇది చాలా మంచి ఆఫర్! మీరు పెట్టిన కోరికల పత్రంలో సగంవరకూ అంగీకరించటం జరిగింది! వచ్చే సంవత్సరం మళ్ళీమీరు 'ఛార్టర్ అఫ్ డిమేండ్స్' పెట్టాలంటే "డిమేండ్స్" అంటూ మీకు మిగలాలికదా! అన్నీ ఇప్పుడే తీర్చేస్తే ఎలాగ? "అంటూ తను విసిరిన జోక్‌కి తనే నవ్వేడు!

పర్సనల్ ఆఫీసరు, ఎడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు కూడా పెదాలపై చిరునవ్వు కదిలించేరు.

సద్గుణరావు గానీ, అతని ప్రక్కనే కూర్చున్న అతని అనుచరులు కానీ నవ్వలేదు! కనీసం ఆ"జోక్"ని గుర్తించినట్టు కూడా ముఖంలో భావాలు చూపలేదు.

ఆంధ్రరాష్ట్రంలో—పెయింట్స్ ఉత్పత్తి చేసే - ఒకానొక పెద్ద కర్మాగారంలోని కాన్ఫరెన్సు హాలు అది!

విశాలమయిన ఆ హాలు అతి అందంగానూ, అతి చల్లగానూ వుంది! క్రీమ్‌కలర్ గోడలకు తగిలించిన ప్రకృతి దృశ్యాలు అతి నిర్మలంగానూ, అతి ఆహ్లాదకరంగానూ వున్నాయి! హాలులో నేల మీద పరిచిన తివాసీ అత్యద్భుతంగా కనబడటమే కాకుండా అతి ఖరీదయిన దానిలా కూడా కనిపిస్తోంది!!

ఆ హాలు మధ్యలో పెద్ద రోజ్‌వుడ్ టేబిలువుంది!

దానిమీద తళతళా మెరిసిపోతున్న లేత ఆకుపచ్చరంగు ముఖమల్ గుడ్డపరచివుంది!

ఆ టేబిలు మీద బంగారు రంగులో కాంతులు విరజిమ్మే ఖరీదయిన ఫ్లవర్‌వాజ్ వుంది! అందులో ఖరీదయినవే కాక, అపురూపమయిన పువ్వులు వున్నాయి! అవి బజారులో కొన్న మామూలు పువ్వుల్లా కాకుండా, ఏ మానస సరోవరంలోనో అరుదుగా పెరిగే

అందాల జాతి పువ్వుల్లా వున్నాయి! పేదవాడి పెరట్లో పెరిగే పొగడ పువ్వుల్లా కాకుండా, ధనవంతుడి ఇంట పెరగటాన్కి కూడా ఆలోచించే పువ్వులు అతి దాబుగానూ, దర్పంగానూ కూడా వున్నాయి! ఆ పూలవాసన అతి ఖరీదయిన పరిమళ ద్రవ్యాల వాసన కంటె ఎక్కువ సుఖంగానూ, హాయిగానూ వుంది!! మత్తు కూడా వుంది!

టేబిల్ కి ఇరువైపులా ఆరు సోఫాల్లాంటి కుర్చీలున్నాయి!

ఒకవైపున-[illegible] ఆ సోఫాల్లాంటి కుర్చీలలో-ఆ కంపెనీ జనరల్ మేనేజరు, పర్సనల్ ఆఫీసరూ, ఆడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరూ ఆసీనులయివున్నారు. వాళ్ళు ముగ్గురూ ఆ సమయంలో- ఆ నునుపయిన సోఫాలలో-ఆ మెత్తని ఆసనాలలో- ముళ్ళ మీద కూర్చున్నట్టు కూర్చున్నారు! ఆ ముళ్ళు ఏవైనా ఈ పరికే తమ బట్టలకు గుచ్చుకుని వుంటే, మర్యాదగా తప్పించుకుని ఎలా లేచిపోవాలా? అని ఆలోచించే వాళ్ళలా కూడా వున్నారు!

ఎదురుగా-రోజ్‌వుడ్ టేబిలుమీద-ముఖమల్ గుడ్డపైన-ప్లవర్‌వాజ్ ప్రక్కన-వంగిపోయిన పూలగుత్తుల నీడన- ఆ కంపెనీ కార్మికులు నెల రోజుల క్రితం సమర్పించిన 'కోర్కెల పత్రం' వుంది! అది వారికి— కోర్కెల పత్రంలా కాకుండా- పాము బుట్టలా కనిపిస్తోంది!! ఆ బుట్టలాంటి పత్రంలో పాముల్లాంటి ఇరవై నాలుగు 'డిమేండ్స్' వున్నాయి! ఆ ఇరవై నాలుగు కోరికలూ తీర్చేస్తే, కంపెనీ మూసేసి, డైరెక్టర్లతో సహా అందరూ నెత్తిమీద గుడ్డ వేసుకుని ఇళ్ళకు వెళ్ళిపోవాలని వాళ్ళకు తెలుసు! కానీ, అలా వెళ్ళిపోవటం మాత్రం ఇష్టంలేదు వాళ్ళకి!! అందుకే- ఆ కోర్కెల పత్రంలో మంది-ఎక్కువ డబ్బు 'కమిట్‌మెంట్' లేని పన్నెండు కోరికలు ఏరి— వాటిని తీర్చటానికి అంతా సిద్ధం చేసుకున్నారు! వాటిని తీరిస్తే, కంపెనీ యాజమాన్యానికి ఏడాదికి అయిదు లక్షల రూపాయలు ఎలా ఖర్చవుతాయో, లెక్కలు చూపించటానికి రెండుగంటలుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. డైరెక్టర్లు ఆ మేరకు ఒప్పుకోవటం చాలా అదృష్టమని, కార్మిక నాయకులకు సర్దిచెప్పటాన్కి కిందా మీదా పడుతున్నారు! ఆ మేరకు ఒప్పించి, అగ్రిమెంటు పేపర్ల మీద సంతకాలు చేయించగల్గితే! మళ్ళీ ఒక సంవత్సర కాలం శాంతి! అందు వలన చూపించిన లాభమే మళ్ళీ మళ్ళీ భూతద్దంలో చూపించి! ఇతర కంపెనీల కంటె తమ కంపెనీ ఎంత ఉదారంగా ప్రవర్తిస్తోందో వివరించి చెప్తున్నారు!

టేబిల్ కి రెండో ప్రక్క మూడు కుర్చీలలోనూ కార్మిక నాయకులు కూర్చున్నారు!

సద్గుణరావు ఆ కంపెనీ లేబర్ యూనియన్ కార్యదర్శి!

మిగిలిన ఇద్దరూ సంయుక్త కార్యదర్శులు!!

వాళ్ళు ముగ్గురూ నిమ్మకు నీరెత్తినట్లు తాపీగానూ, కులాసాగానూ కూర్చున్నారు!

సద్గుణరావుకు యూనియన్ నడపటంలో మంచి అనుభవం వుంది. మిగిలిన అనుచరులిద్దరికీ అనుభవం లేకపోయినా, సద్గుణరావు గుణగణాల మీద అనుభవం మీదా నమ్మకం వుంది. మొత్తం ముగ్గురికీ తమ కోరికలు సాధించుకు తీరాలనే పట్టుదలవుంది. యాజమాన్యం దిగివచ్చి తమ డిమేండ్లను తీరుస్తారనే ధీమా వుంది! తమకోర్కెల పత్రంలో కొన్ని గొంతెమ్మ కోరికలు వున్నాయని వాళ్ళకు కూడా తెలుసు! వాటిని తీర్చటం యాజమాన్యం వల్ల కాదనీ వాళ్ళకి తెలుసు! మొత్తం కంపెనీ తాకట్టుపెట్టేసినా అంత డబ్బు కార్మికులకు ఇవ్వటం సాధ్యం కాదని కూడా వాళ్ళకి బాగా తెలుసు!! అవన్నీ మొత్తంగా తీరేకోరికలుకావని వాళ్ళకు బాగా బాగా తెలుసు!

అయితే—

ఏ 'యాజమాన్యం' అయినా చావు కు పెడితేగానీ, లంఖణాలకు దిగిరారని వాళ్ళ నమ్మకం!

అడగకుండా అమ్మయినా పెట్టదని సామ్యం చెప్పినట్లే, అల్లరి పెట్టకుండా ఏ యాజమాన్యమూ జీతభత్యాలు పెంచదని వాళ్ళకి స్పష్టంగా, నిర్దిష్టంగా తెలుసు!!!

వాళ్ళకు తెలియని దల్లా, ఈ చర్చలు ఇంకా ఎంతకాలం ఇలా జరిపించాలన్నదే!!

ఆ ముగ్గురు కార్మిక నాయకుల వెనుకా అయిదువందల మంది కార్మికుల మద్దతు వుంది! అవసరం వచ్చి సమ్మె ప్రారంభిస్తే వాళ్ళందరూ తమకు పూర్తి సహకారం అందజేస్తారనే నమ్మకం వుంది!

అందుకే- వాళ్ళ విడిదిలో వియ్యాల వారిలా ధీమాగా, తొణక్కుండా కూర్చున్నారు!!

సద్గుణరావు నిశ్చలంగా కూర్చుని, అంతకంటే నిశ్చలంగా ఆలోచిస్తున్నాడు!

ఈవేళ చర్చలు ఒక కొలిక్కి-రాకుండా ఆగిపోతే సమస్యను జటిలం చేయాలి!!

తీరని సమస్య మరింత జటిలంకావటమే తమకు మంచిది!


రేపు నిరసన నినాదాలు చేస్తూ ఫ్యాక్టరీలోకి వెళ్ళాలి!

తర్వాత వారంరోజులు ఆగి- నల్లబేడ్జీలు ధరింపజేయాలి, కొంతకాలం ఆగి వర్క్-టు రూల్. ఆ తర్వాత స్ట్రైక్ బేలేట్.

అనుపానులు చూసుకుని సమ్మె నోటీసు ఇవ్వాలి.

అంతవరకూ కూలంకషంగా చర్చించి, ఆలోచించి ఒక పథకం తయారుచేసుకున్నాడు సద్గుణరావు. కార్మికులందరినీ ఒక పద్ధతిలో రెచ్చిగొట్టటం, కూడగట్టుకుని రావటం, అతనికి వెన్నతో పెట్టినవిద్య.






ఈ "అగ్రిమెంటు" మీద సంతకాలు జరగాలంటే ప్రస్తుతం ఏటా ఇస్తున్న పది శాతాన్ని పదిహేనుశాతం చేయమంటున్నాడు. ఆ పన్నెండు కోరికలతో బాటు, ఈ ఒక్క కోరిక తీరిస్తే, అగ్రిమెంటుమీద సంతకాలు చేయటానికి తనకు ఎలాటి అభ్యంతరమూ లేదు. కానీ ఆ పాయింటుకు యాజమాన్యం అంగీకరించటం లేదు. అక్కడే మడతపేచీ వచ్చింది.

సద్గుణరావునుంచి ఎటువంటి జవాబూ రాకపోయేసరికి, జనరల్ మేనేజరు ముఖం చిట్లించుకుని, ఫుల్‌హాండ్స్ షర్టు స్లీవ్ మడత పైకిలాగి, వాచీ చూసుకున్నాడు.

"మిస్టర్ సద్గుణరావ్. జి. యమ్‌గారు రెండుగంటల ఫ్లయిట్‌కి వెళ్ళాలి. మనం మనచర్చలు తొందరగా తెమిలిస్తే బాగుంటుంది." అన్నాడు పర్సనల్ ఆఫీసరు పరిస్థితి గమనించి.

సద్గుణరావు అందుకోసమే ఎదురుచూస్తున్నట్టు "చర్చలు ముగించటానికి నాకు ఎటువంటి అభ్యంతరమూ లేదు. మీరు ఒప్పుకుంటున్న పన్నెండు కోరికలూ మాకు ఆమోదయోగ్యమే. అయితే, బోనస్ విషయం తేల్చలేదు మీరు. జి. యమ్‌గారు ఫ్లయిట్‌కి వెళ్ళే కంగారులో వుంటే మరో రోజు మాట్లాడుకుందాం. మాకు కంగారు లేదు. తేదీ నిర్ణయించి కబురు చెయ్యండి." అంటూ కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు.

ఈ హఠాత్పరిణామానికి జనరల్ మేనేజరు కాస్త కంగారుపడ్డాడు.

ఈవేళ్టితో ఎలాగయినా చర్చలు ముగించెయ్యాలని అతని తాపత్రయం. ఈ టెన్షన్ లోనుండి ఎంత తొందరగా బయటపడితే అంత సుఖంగా వుంటుంది.

"మిస్టర్ సద్గుణరావ్. ప్లీజ్ టేక్‌యువర్ సీట్. నాకు కంగారేమీ లేదు." అన్నాడు మెత్తని స్వరంతో.

సద్గుణరావ్ మళ్ళీ కూర్చున్నాడు.

జి. యమ్ గొంతు సవరించుకుని "మా ఫైనల్‌డీల్ చెప్తున్నాను, వినండి...." అంటూ ఆరంభించేడు.

సద్గుణరావు ఆశగా అతనివంకచూసేడు. చర్చలు ముందుకు సాగుతాయని చిన్న ఆశ కల్గింది అతనికి.

"గడచిన అయిదేళ్ళుగా కంపెనీ లాభాలు ఎలా తగ్గిపోతున్నాయో మీకు తెలుసు! ఓవర్ హెడ్ ఛార్జెస్ పెరిగి పోయాయి. 'రా' మెటీరియల్ మీద ప్రభుత్వం విపరీతమయిన డ్యూటీలు వేస్తోంది. యంత్రాలు పాతవయి పోవటం వల్ల వాటి సామర్థ్యం తగ్గిపోయింది. ఇక మార్కెట్ సంగతి సరేసరి! మనకు పోటీగా బోలెడు రకాలు ప్రోడక్ట్సు మార్కెట్‌లోకి వచ్చేయి. కొత్తరకం "ప్లాస్టిక్ ఎమల్షన్స్" ఎంతో చౌకగా వచ్చేస్తున్నాయి గడచిన రెండేళ్ళలో. అందువలననే మన లాభాలు బాగా తగ్గిపోయాయి.

బోనస్ మీకు పదిహేను శాతం ఇవ్వాలంటే మరో రెండు లక్షల రూపాయలు అదనంగా ఖర్చవుతుంది. అంత ఖర్చుకు డైరెక్టర్లు సిద్ధంగా లేరు. అందువల్ల మనం మధ్య మార్గం ఏదో ఒకటి ఆలోచించటం మంచిది." అని కొంతసేపు మాటలు ఆపి ఊపిరి దీర్ఘంగా పీల్చుకుని "ఈ పన్నెండు కోరికలూ ఇరు పక్షాలకూ ఆమోదయోగ్యం కనుక! ఈ మేరకు మనం అగ్రిమెంటు రాసుకొని సంతకాలు చేద్దాం! బోనస్ విషయం ఒక్కటే వదిలేసి తర్వాత చర్చిద్దాం! దాని విషయమై చర్చలు జరిపేందుకు మా తలుపులు అన్నివేళలా తెరిచి వుంటాయి!" అన్నాడు.

ఆ మాటలకు సద్గుణరావు జి. యమ్ వంక అదోలా చూశాడు!' ఆ చూపు- "ముసలి పులిచేతిలోని బంగారు కంకణం చూసి మోసపోయి దగ్గరకు వెళ్ళిన అమాయకపు బాటసారి చూపులా కాకుండా; ఆ ముసలి పులి కంకణం ఆశచూపి తను దగ్గరగా వెళ్తే చంపి తినెయ్యటానికి ప్లాను సిద్ధం చేసుకుని వుందని ముందే తెలుసుకున్న గడుసు బాటసారి చూపులా"- చాలా పదునుగానూ, తీవ్రంగానూ వుంది!!

కొద్ది క్షణాల తర్వాత గొంతు సవరించుకుని అన్నాడు సద్గుణరావు." బజారులో నిత్యావసర వస్తువుల ధరలు ఎలా మండిపోతున్నాయో మీకూ తెలుసు. ఇళ్ళ అద్దెలు గడచిన సంవత్సరంలో రెండింతలు పెరిగిపోయాయి. పిల్లల స్కూలు ఫీజులు కొత్త ప్రభుత్వం ధర్మమా అని మరింత అయ్యేయి! నోటు పుస్తకాలు, తెల్ల కాగితాలు ధరలు చుక్కలనంటుతున్నాయి. ప్రభుత్వం తయారు చేసిన ధరల సూచీలోనే బోలెడంత పెరుగుదల కన్పిస్తోంది. యంత్రాలు పాతబడినట్లే, కార్మికులూ ముసలి వాళ్ళయిపోతున్నారు. వాళ్ళకి రోగాలు, రొచ్చులూ, మందుల ఖర్చులూ పిల్లల చదువులూ, పెళ్ళిళ్ళు, పురుళ్ళ ఖర్చులూ, ఇలా ఎన్నో సమస్యలు పెరిగిపోతున్నాయి. వీటన్నిటినీ సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలన్నది అందరూ ఒప్పుకునే సత్యం. బోనస్ విషయం ఒక్కటే ప్రక్కన పెట్టి అగ్రిమెంటు మీద సంతకాలు చెయ్యమంటున్నారు మీరు!! అంతకంటె ఆత్మహత్య సదృశం మరొకటి వుండబోదు మాకు! ఇది సమస్యను తీర్చే మధ్యే మార్గం కాదు." తాపీగా, దృఢంగా మాట్లాడటం ముగించేడు.

జనరల్ మేనేజర్ ఒక్క క్షణం కళ్ళు మూసుకొని కుర్చీలో వెనక్కు వాలి తర్వాత కళ్ళు తెరిచి "సరే! ఇలాగ లాగుతూ పీకుతూ కూర్చుంటే లాభం లేదు!పన్నెండు శాతం బోనస్ ఇవ్వటానికి డైరెక్టర్లను ఒప్పి

స్తాను! ఇదిగో, డ్రాఫ్ట్ ఎగ్రిమెంటు'! సంతకాలు చెయ్యండి!!" అంటూ తన ఎదుటి సొరుగులో నుండి మరో ఫయిలు తీసి ఎదుట పడేశాడు!

సద్గుణరావుకి నవ్వొచ్చింది.

పన్నెండు శాతం బోనస్ ఇవ్వటానికి అంతారెడీ చేసుకొని ఇంతసేపూ బేరాలు సాగించేరన్నమాట.

తన ఎదురుగావున్న ఫయిలునుప్రక్కకు తోస్తూ "పదికి పదిహేనుకి మధ్యే మార్గం పన్నెండు కాదు! పన్నెండున్నర! ఆలోచించండి." అన్నాడు నవ్వుతూ.

జనరల్ మేనేజర్ ముఖం కందగడ్డలా అయిపోయింది.

చిరాకుగా తల విదిలించి "ఆల్‌రైట్. మిస్టర్ సద్గుణరావ్. పన్నెండున్నర శాతం బోనస్ ఇచ్చే ఏర్పాటు చేస్తాను. డ్రాఫ్ట్ ఎగ్రిమెంట్‌మీద సంతకాలు చెయ్యండి." అన్నాడు.

"ఇది ఫైనల్ ఎగ్రిమెంట్. అంతే జనరల్ బాడీ మీటింగ్, మా కార్మికుల అనుమతి తీసుకునే వరకూ ఏ విధమయిన సంతకాలు చెయ్యం. వాళ్ళు ఒప్పుకోక పోతే మాత్రం మనం మరోసారి టేబిలు చుట్టూ కూర్చోవలసిన అవుసరం వస్తుంది"

అంటూ లేచి నిలబడ్డాడు సద్గుణరావ్,

జనరల్ మేనేజర్ చిరాకుగా తల విదిలించి ఫైలు తీసి,

సొరుగులో పడేశాడు.

అందరూ తమతమ కుర్చీల్లోంచి లేచి పోయారు.

అయిదు నిముషాల తర్వాత ఆ హాలు ఖాళీ అయిపోయింది.

• • •

"కాఫీ తీసుకోండి."

పేము కుర్చీలో వెనక్కు వాలి, కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్న సద్గుణరావు భార్య జయంతి పిలుపుతో కళ్ళు తెరిచేడు బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ, భార్య చేతిలోని ట్రేలో కాఫీ కప్పు అందుకున్నాడు మరో కప్పు తాను తీసుకుని, ట్రే టేబిలు మీద పెట్టి ఎదుటి కుర్చీలో కూర్చుంది జయంతి.

వేడి కాఫీ చప్పరించే సరికి ప్రాణం లేచి వచ్చినట్లయింది సద్గుణ రావ్‌కు.

"సింప్లీ మార్వలెస్" కాఫీ, జయా... థేంక్యూ." అన్నాడు.

జయంతి చిరునవ్వుతో "ఈ థేంక్స్ నాకు చెప్పాల్సింది కాదు. మన సూరమ్మకి చెప్పాలి. ఈవేళ డికాక్షన్ తనే తీసింది. నేను పాలు, పంచదార వేసి తెచ్చేను. అంతే" అంది.

సద్గుణరావు చిలిపిగా నవ్వుతూ "కాఫీ రుచి డికాక్షన్ లోనూ, పాలలోనూ లేదు. ." అన్నాడు,

"మరి.... పంచదారలోవుందా?" అంది జయంతి కొంటెగా.

"కాదు.... అందించిన నీ చేతుల్లోవుంది" అన్నాడు భార్య వంక ఆబగా చూస్తూ.

"చాల్లెండి, మీ పరిహాసాలు... అదిసరే సురేష్ సెవెన్త్‌క్లాసు సీటుగురించి ఆలోచించేరా?... వనజనికూడా ట్యుటోరియల్ నుండి మార్చేసి మంచి స్కూల్లో చేరుద్దాం... ఏమంటారు?" అంది.

"జయా. అదంతా నీ ఇష్టం. వాళ్ళ చదువుబాధ్యతలన్నీ నీవే. నేనెంత బిజీగా వుంటున్నానో చూస్తున్నావు కదూ." అన్నాడు కాఫీకప్పు టేబిలుమీద పెడుతూ.

"కంపెనీలో మీ "టాక్స్" ఎంతవరకూ వచ్చేయి?" కుతూహలంగా అడిగింది.

"మేం అనుకున్న మేరకు అన్నీ సాధించాం. బోనస్ కూడా పన్నెండున్నర శాతం ఇవ్వటానికి అంగీకరించేరు. జనరల్‌బాడీలో అందరూ ఒప్పుకుంటే అగ్రిమెంటు అయిపోతుంది." అన్నాడు.

జయంతీ, సద్గుణరావ్ బియ్యేస్సీలో సహాధ్యాయులు. ఇద్దరూ కాలేజీ రోజుల్లోనే ప్రేమించుకున్నారు. డిగ్రీ తీసుకున్నాక సద్గుణరావు పెయింట్స్ కంపెనీలో టెక్నిషియన్‌గా చేరిపోయాడు. ఉద్యోగంవచ్చాక ఇద్దరూ వివాహం చేసుకున్నారు. అతని ప్రోద్బలంతో జయంతి ఎమ్మే సైకాలజీ చదివి, ఓ ప్రయివేటు కాలేజీలో లెక్చరర్‌గా చేరింది. తర్వాత, ప్రయివేటుగా ఎమ్మే సోషియాలజీకూడా ప్యాసయింది. జయంతి సహృతకూ, సంస్కారానికి జోహార్లంటాడు సద్గుణరావు. ముఖ్యమయిన నిర్ణయాలు తీసుకునే విషయంలో భార్య సలహాలు తప్పక పాటిస్తాడు.

"మొత్తానికి సాధించేరన్నమాట." అంటూ తన కాఫీ కప్పు టేబిలుమీద వుంచింది.

సద్గుణరావు గర్వంతో కూడిన చిరునవ్వు పెదాలపై కదిలించేడు.

"మీకు మరో చిన్నప్రాబ్లమ్." అంది జయంతి.

"ఏమిటది?"

"మన పనిమనిషి సూరమ్మ జీతం పెంచమంటోంది."

"ఇపుడు యనభైరూపాయలు ఇస్తున్నాం కదా...."

"అవును. సరిపోవటం లేదుట."

"ఆహా అయితే మనమేం చెయ్యగలం! ఇప్పట్లో పెంచేదిలేదని చెప్పు." అన్నాడు







విసుగ్గా.

"మీతో మాట్లాడాలంటోంది." అంటూ "సూరమ్మా. ఇలారా." అని కేక పెట్టింది జయంతి.

సూరమ్మ మెల్లగా అడుగులువేసుకుంటూ వచ్చి డ్రాయింగురూం తలుపు వెనకే నిలబడిపోయింది.

సూరమ్మకు యాభయి ఏళ్ళు పైనే వుంటాయి. భర్త నాలుగేళ్ళక్రితం హఠాత్తుగా చనిపోయాడు. ముగ్గురు పిల్లలున్న అతి పేదసంసారం ఆమెది. పిల్లలు ఆలస్యంగా పుట్టటంవల్ల ఎవ్వరూ ఇంకా చేతికి అందిరాలేదు. ఈ ఇంట్లో పనిచేస్తూ వచ్చే జీతం యనభయి రూపాయలతో ముగ్గురు పిల్లల్నీ సాక్కొస్తోంది.

"ఏం సూరమ్మా, జీతం చాలటం లేదన్నావా?" అడిగేడు.

"బాబూ. పొద్దుటేళనుంచీ పొద్దుపోయే వరకూ మీ ఇంట్లో రెక్కలు ముక్కలుచేసుకుని కష్టపడుతున్నాను. నీళ్ళు తోడటం, వంటచెయ్యటం, అంట్లగిన్నెలు తోమటం, పిల్లల కేరేజీలు కట్టటం, బట్టలు ఉతకటంతో సహా అన్నిపనులూ చేస్తున్నాను. ఈపనంతా మీరిచ్చే జీతానికి మాత్రమే ఆశపడి చెయ్యటం లేదుబాబూ. మీరు పెట్టే గుప్పెడు మెతుకులకు, గ్లాసుడు కాఫీనీళ్ళకూ ఆశపడి చేస్తున్నాను. కానీ నా కడుపుగురించి నేను చూసుకుంటే నా కొడుకుల ఆకలి ఎలా తీరుకుంది? వాళ్ళ బతుకులు ఎలా కడతేరుతాయి? వాళ్ళ చదువులు ఎలా సాగుతాయి? నేను ఈ ఇంట్లో పనికి కుదురుకుని మూడు సంవత్సరాలయిపోయింది. ఈ యేట్టిదాకా పైసా పెంచమని అడగలేదు. ధరలు చూస్తే మండిపోతున్నాయి. అందుకని, ఇరవై రూపాయలు పెంచితే మీ ఋణం వుంచుకోను." అంది రెండుచేతులూ ఎత్తి నమస్కరిస్తూ.

సద్గుణరావు చిరాగ్గా ఆమెవంకచూసేడు.

"ఆ సోది అంతా చెప్పకు. ధరలు నీ ఒక్కతికే పెరిగిపోయాయా? మాకూ పెరిగేయి. ఇద్దరం ఉద్యోగాలు చేసి ఆర్జిస్తేకానీ మాకూ గడవటం లేదు. ఇప్పట్లో నీ జీతం పెంచటం కుదరదు. మరో ఏడాది ఆగు. అపుడు ఆలోచిద్దాం." అన్నాడు.

"మూడు సంవత్సరాలబట్టీ ఆగలేదా బాబూ. ఇపుడు కష్టంగా వుంది." అంది బతిమాలుతూ.

"సూరమ్మా నన్ను విసిగించకు. ఇష్టముంటే పనిచెయ్. లేదా వేరేఇల్లు చూసుకో. నమ్మకంగా వుంటున్నావని యనభయిరూపాయలు ఇస్తున్నాం. ఆశకు అంతుండాలి." అంటూ చిరాకుగా పేపరు చేతిలోకి తీసుకున్నాడు సద్గుణరావు.

సూరమ్మ మరి మాట్లాడలేదు.

"పోనీలే బాబూ." అంటూ గొణుక్కుంటూ అక్కడినుండి కదిలిపోయింది.

రెండునిమిషాలు నిశ్శబ్దం రాజ్యమేలింది.

తర్వాత జయంతి తనవంక అదోలా చూడటం గమనించి "ఏమిటలా చూస్తున్నావ్?" అన్నాడు సద్గుణరావు.

జయంతి చిరునవ్వుతో "అబ్బే, ఏమీ లేదు. మధ్యాహ్నంవరకూ కార్మికుల తరపున వకాల్తా తీసుకుని మేనేజ్‌మెంటుతో వాద ప్రతివాదనలు కొనసాగించి వచ్చేరు. ఇపుడు మీరు మేనేజిమెంట్ కుర్చీలోకూర్చున్నారు. పరస్పర విరుద్ధమయిన [illegible] ఎంతచక్కగా ప్రకటించ గలుగుతున్నారో చూస్తున్నాను అంది.

ఆ మాటలలో వున్నది నిజాయితీయో, లేక వ్యంగ్యమో గ్రహించలేకపోయాడు.

"నీకు తెలీదు జయా, వీళ్ళు అలగాజనం వీళ్ళ ఆశకు అంతుండదు. కాస్త మెత్తగా వుంటే నెత్తికెక్కుతారు. జీతం పెంచకపోతే సూరమ్మ ఏం చేస్తుంది? పనిలోకి రావటం మానేస్తుంది. అంతేకదా. మనకు మరోపని మనిషి దొరకక్కపోదు. అన్నాడు జయంతి వంక చూస్తూ.

"ఔను నిజమే. సూరమ్మమానేస్తే మరో ఎల్లమ్మ వస్తుంది. కాకపోతే మరో పుల్లమ్మ వస్తుంది. మన సూరమ్మ పని మానదని నాకు నమ్మకం వుంది." అంది జయంతి.

ఆమె ఎంతమెల్లగా మాట్లాడినా గొంతులోని ఆవేశం అణచిపెట్టుకోలేక పోయింది. ఆమె పెదాలు వణకటం గమనించి కాస్త ఆశ్చర్యంతో అడిగేడు సద్గుణరావు. "ఎందుకలా అనుకుంటున్నావ్? చెప్పకుండా హఠాత్తుగా పని మానెయ్యకూడదని అగ్రిమెంట్లున్నాయా? బాండు పేపరుమీద సంతకాలున్నాయా? మానేస్తే అడిగేదెవ్వరు? అడగ్గలిగింది ఎవ్వరు?"

"మానేస్తే ఎవరూ అడగలేనిమాట వాస్తవమే! అయితే, మీరు ఏ విధమయిన 'ఎపాయింటుమెంటు ఆర్డరు' దానిచేతికిచ్చేరని, అది ఎగ్రిమెంటు రాస్తుంది? మీరు ఏ విధమయిన "జాబ్ సెక్యూరిటీ" చూపించేరని, అది బాండు రాస్తుంది? మనం దానికి ప్రావిడెంటు ఫండు జమచేస్తున్నామా? మెడికల్ ఇన్సూరెన్సు చేయించి రోగాలకయ్యేఖర్చులు భరిస్తున్నామా? బోనస్‌లిస్తున్నామా? పెన్షన్ చెల్లించబోతున్నామా?!! అవన్నీ లేనపుడు హఠాత్తుగా మానేసే హక్కు దానికుంది! కాదంటారా"

మాటలు ముగించేసరికి ఆమె ముఖం కందగడ్డలా అయిపోయింది.

"ఎందుకు కాదంటాను? అందుకే పని మానేస్తుందని చెపుతున్నాను!" అన్నాడు సద్గుణరావు.

జయంతి వింతగా నవ్వింది.

"పని మానేస్తే భుక్తి గడవదు! అది మీలా "వర్క్ టు రూల్" పాటించటం లేదు. నల్లబేడ్జీలు ధరించలేదు! సమ్మె చెయ్య

అన్నిరకముల వస్తువుల ప్యాకింగ్ చేయువారు.

ప్యాకర్స్ అండ్ ప్యాకర్స్

కుమార్,
1-2-606/192
రామంతనగర్
ఇందిరాపార్క్ వద్ద, గాంధీనగర్,
హైదరాబాద్-500380.

లేదు! సూరమ్మే కాదు, ఈ వ్యవస్థలోని వ్యవసాయ కూలీలుగానీ, వెట్టిచాకిరీ చేసే వాళ్ళుగానీ, ఈ రకం కార్మికులు ఎవ్వరూ పనిమానేసి యజమానిని ఎదిరించలేరు! కేవలం పారిశ్రామిక కార్మికులకు మాత్రమే ఆ హక్కు ధారాదత్తమయింది!"

జయంతి మాటల్లో ఆవేశం చూసి మతిపోయినట్లయింది అతనికి! ఆమెలో వింత వ్యక్తిని దర్శిస్తున్నట్లనిపించింది.

మాటలు కూడదీసుకుంటూ అన్నాడు. "జయంతీ! పారిశ్రామిక కార్మికులతో పనిమనుషుల్నీ, వ్యవసాయకూలీలనూ పోల్చకు! పరిశ్రమల్లో కార్మికుల "వర్కింగు కండిషన్సు" నీకుతెలియదా. ఘోరమయిన ప్రమాదాలు, వాతావరణ కాలుష్యం, పారిశ్రామిక కార్మికులను వెన్నంటి వున్నాయని మరిచిపోకు! మేము ఎంత "రిస్కు" తీసుకుంటున్నామో లెఖ్ఖలోకి తీసుకోవద్దా?"

జయంతి బరువుగా ఊపిరిపీల్చుకుని, ఒక్క క్షణం ఆగి అంది.

"పరిశ్రమలో కార్మికునికి ఎంత రిస్కువుందో వ్యవసాయ కూలీకి అంతే రిస్కువుంది! ఆఖరికి రోడ్డుమీద నడిచే మనిషికి రిస్కుంది! ఈ దేశంలో పరిశ్రమల్లో చావులకంటే రోడ్డు ప్రమాదాల్లో చావులు ఎక్కువన్న సంగతి మరచిపోకండి! పరిశ్రమలో ప్రమాదం జరిగితే ఆ కార్మికుణ్ణి ఆదుకునేందుకు ఇ. ఎస్. ఐ. హాస్పిటల్స్, రకరకాల ఇన్సూరెన్సు స్కీములు వున్నాయి! పరిశ్రమల్లో ఆసుపత్రులున్నాయి! అయితే పొలం దున్నే జీతగాణ్ణి ఎద్దు డొక్కలో పొడిస్తే ఏ రాజ్యాంగ సూత్రం ఆదుకుంటోంది? ఏ పారిశ్రామిక చట్టం అతనికి కట్టు కట్టిస్తోంది ఏ ఆసుపత్రి అతనికి ఉచితంగా మందులిస్తోంది? అతడి కుటుంబాన్ని ఎవరు ఆదుకుంటున్నారు? చెప్పండి? ఇక వాతావరణ కాలుష్యం సంగతంటారా? మొన్న భోపాల్ విషవాయువు గొడవలో చనిపోయిన వాళ్ళందరూ ఊళ్లో ప్రజలే! అందులో పనిచేసే కార్మికులు కాదు."

సద్గుణరావుకు తనవాదం వీగిపోవటంతో పౌరుషం ముంచుకొచ్చింది.

"అయితే పరిశ్రమల్లో పనిచేసే వారికి ఇంతింత జీతాలు ఎందుకిస్తున్నారు? యజమానులు మూర్ఖులనుకుంటున్నావా?.... వెర్రి వాళ్ళనుకుంటున్నావా?" అన్నాడు గొంతు పెంచి.

"పరిశ్రమల యజమానులు మూర్ఖులు కాదు! వెర్రివాళ్ళంత కంటె కాదు! వాళ్ళు అంతంత జీతాలివ్వటానికి కారణం కార్మికులు చేసేపనిని బట్టి కాదు, నిజానికి..."

"మరి దేన్ని బట్టి?... సరదాకి ఇచ్చేస్తున్నారా?" ఆమె మాటలకు అడ్డుతగిలేడు సద్గుణరావు.

అతని గొంతులోని వ్యంగ్యం గ్రహించి మెల్లగా నవ్వుతూ అంది.

"మీ పారిశ్రామిక కార్మికుల వెనుక "ఆర్గనైజ్‌డ్ లేబరుయూనియన్లు" వున్నాయి అందువల్ల మీకు "బార్ గైనింగ్ కెపాసిటి" వుంది. మీరు మీ యజమానులకు టరమ్స్ "డిక్టేట్" చేయగలరు! ఈ దేశంలో మేలు పొందుతున్న కార్మికులు కేవలం పారిశ్రామిక కార్మికులు మాత్రమే! జీతాలు పెంచుకునేదీ, బోనస్‌లు రాబట్టుకునేదీ మీ యాభై లక్షలమంది మాత్రమే!! సూరమ్మలాంటి మూడుకోట్లమంది కార్మికులు ఈ దేశంలో పీడింపబడుతూనే వున్నారు! నిజానికి వాళ్ళు రోజులో మీ కంటె ఎక్కువగంటలు పని చేస్తున్నారు. పారిశ్రామికంగా మీరిచ్చే ఉత్పాదక శక్తికంటే, వ్యవసాయంలో, ఇతర రంగాలలో వారి ఉత్పాదక శక్తి మూడింతలువుంది! అయితే వాళ్ళకి సంఘటిత శక్తి లేదు!"

జయంతి మాటలు ఆపింది! ఆమె ముక్కుపుటాలు ఎగిరిపడుతున్నాయి. సద్గుణరావు కొంతసేపు మౌనం వహించాడు!

తర్వాత "వాళ్ళందరూ సంఘటితమై వాళ్ళ న్యాయమైన హక్కులకోసం పోరాడవచ్చుకదా! వాళ్ళకి పోరాడేశక్తి, బేరంచేసే శక్తి వచ్చినవాడు మనం ఎలాగూ జీతం పెంచక తప్పదు!... ఇపుడెందుకు పెంచాలి?" అన్నాడు.

"నాలుగ్గోడలమధ్య వుంటున్నారు కనుక మీకు సంఘటితం కావటం సులువవుతోంది! అదీకాక మీకుచదువుంది! ఆదుకునే ప్రభుత్వ యంత్రాంగం అందుబాటులోవుంది! కార్మిక చట్టాల్లోని మంచిచెడ్డలు అర్థంచేసుకుని ఎదరకు నడిపించే నాయకత్వం వుంది. మిగిలినవాళ్ళకు సంఘటితమై ఒక సంఘంగా ఏర్పడటానికి ఈ దేశంలో అవకాశాలు చాలా తక్కువ...." అంటూ జయంతి ఒక్క క్షణం మాటలు ఆపి తర్వాత మెల్లగా అంది "సూరమ్మకు ఈ నెలనుండీ జీతం ఇరవై రూపాయలు పెంచుదాం!... రేపుపండగకు ఒక చీర బోనస్‌గా ఇద్దాం.... కాదనకండి ప్లీజ్!.... సూరమ్మలాంటి పనిమనుషుల విషయంలో మనం చూడవలసింది "బార్ గైనింగ్ కెపాసిటీకాదు! వాళ్ళయెడల మనం చూపవలసింది మానవతాదృక్పథం! అంతే" అంటూ మెల్లగా లేచి ఖాళీకప్పులు ట్రే లో సర్దింది!

సద్గుణరావు మరి మాట్లాడలేదు!!! ●

